

# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# కాంగ్రెస్‌ను నమ్మితే భూములు ఖతమే



- పథకాలు పోతయ్.. చీకటి రోజులు వస్తయ్
- ధరలు పడిపోతయ్.. కబ్జాలు పెరుగుతయ్
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతాంగం
- హస్తం పార్టీకి బుద్ధి చెబుతామని హెచ్చరిక
- రైతుబిడ్డ కేసీఆర్‌కు అండగా ఉంటామని స్పష్టీకరణ

పెద్దపల్లి, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి రాష్ట్రంలో చివరిసారి అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రైతుల పట్ల అనుచితంగా ప్రవర్తించింది. కరెంట్, నీళ్లు లేక రైతులు తీవ్రమైన నష్టాల్లో కూరుకుపోయారు. అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్నారు. కరెంట్ కోసం ఆందోళనకు దిగిన రైతులపై అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అనుచితంగా ప్రవర్తించి గుర్రాలతో తొక్కించి చంపిన సందర్భాలను సైతం అన్నదాతలు గుర్తు చేసుకుంటున్నారు. రాత్రి మూడు గంటలు, పొద్దంతా నాలుగు గంటల కరెంట్ ఇచ్చి రైతుల ఉసురు పోసుకుని పదేళ్లు అధికారానికి దూరంగా ఉన్నా కాంగ్రెస్ పార్టీ వైఖరిలో మార్పు కనిపించడం లేదు. ఇప్పటికీ అదే తీరుతో రైతులపై విరుచుకుపడుతోంది. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తూ సీఎం కేసీఆర్ దుబారాకు పాల్పడుతున్నారని, కేవలం మూడు గంటల కరెంట్ ఇస్తే సరిపోతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద దుమారాన్నే లేపాయి. ఈ విషయాన్ని రైతులు మర్చిపోకముందే తను చేసిన వ్యాఖ్యలను సమర్థించుకుంటూ 10 హెచ్‌పీ మోటర్లు పెడితే మూడెకరాలు మూడు గంటల్లో పారుతుందని చెప్పడంతో రైతులకు పుండు మీద కారం చల్లినట్లయ్యింది. అంతే కాకుండా, రైతుల భూములకు పూర్తి స్థాయిలో రక్షణ కల్పించే లక్ష్యంతో సీఎం కేసీఆర్ కొత్త రెవెన్యూ చట్టాన్ని తెచ్చి పట్వారీ వ్యవస్థను తొలగించారు. అధికారుల చేతిలో ఉన్న భూములనే రైతుల చేతిలో పెడుతూ ధరణి పేరుతో ఒక పటిష్టమైన వ్యవస్థను తెచ్చారు. దీనిపైనా కాంగ్రెస్ నాయకులు విచక్షణారహితంగా మాట్లాడుతున్నారు. ఆ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ ధరణిని బంగాళాఖాతంలో పడేస్తామని చెప్పడం రైతుల్లో కలకలం సృష్టిస్తున్నది.

## పదేళ్లలో అనూహ్య మార్పు

ఎండుగులా మారిన వ్యవసాయాన్ని పండుగలా తీర్చిదిద్దిన బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఈ రంగంలో అనేక సంస్కరణలు తెచ్చింది. అన్ని విషయాలను పక్కన పెట్టి వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత రంగంగా గుర్తించి చేయూతనిచ్చింది. 24 గంటల ఉచిత విద్యుత్, కాళేశ్వరం వంటి విప్లవాత్మక ప్రాజెక్టు నిర్మాణంతో సాగు నీటి వ్యవస్థను పటిష్ట పర్చింది. ఒకప్పుడు రైతుల ఆత్మహత్యకు పురికొల్పిన అంశాలను పరిశీలించి ఆ వ్యవస్థల నాడిపై దెబ్బకొడుతూ రైతుబంధు పేరుతో వ్యవసాయానికి పెట్టుబడి సహాయాన్ని అందించింది. రైతులు అప్పుల పాలు కాకుండా రక్షణ కల్పించింది. భూగర్భ జలాలను వృద్ధి చేసే లక్ష్యంతో మిషన్ కాకతీయ కింద చెరువులు, కుంటలను పునరుద్ధరించింది. పుష్కలమైన నీళ్లు, నాణ్యమైన కరెంట్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఒకప్పుడు ఎకరం, రెండెకరాలు సాగు చేసిన రైతులు ఇప్పుడు ఉన్న భూమి మొత్తాన్ని సాగులోకి తెచ్చుకుని బంగారు పంటలు పండిస్తున్నారు. ఈ సంస్కరణలతో వ్యవసాయం గాడిలో పడడంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా మారింది. ఒకప్పుడు అప్పుల కోసం చేయిచాపిన రైతులు ఇప్పుడు ఇతరులకు అప్పులు ఇచ్చి ఆదుకునే స్థితికి వచ్చారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల పట్ల కనబరుస్తున్న ప్రాధాన్యతను జీర్ణించుకోలేక పోతున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు వీటిని రైతులకు దూరం చేయాలనే కుట్ర కోణంలో ఆలోచన చేస్తున్నట్లు కనిపిస్తున్నది.

## చేజారితే జరిగేది ఇదే..

పదేళ్లలో వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పుల కారణంగా రైతులు సుఖసంతోషాలతో జీవిస్తున్నారు. రైతులు బీఆర్ఎస్‌కు వెన్నుదన్నుగా ఉన్నారని విషయాన్ని గ్రహించిన ఆ పార్టీ రైతులపై విచక్షణా రహితంగా విషాన్ని చిమ్ముతోంది. ఒకవేళ తప్పిదారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇప్పుడు రైతులు ప్రయోజనం పొందుతున్న వ్యవస్థలన్నీ కుప్పకూలే ప్రమాదం పొంచి ఉన్నది. ఒకప్పుడు నీళ్లు, కరెంట్ లేక రైతుల భూములకు ధరలు ఉండేవి కావు. ఇప్పుడు ఈ సదుపాయాలు కల్పించిన తర్వాత గత మూడు నాలుగేళ్లలో భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రధాన రహదారుల వెంట ఉన్న భూములకు ఎకరాకు రూ.కోటి నుంచి రూ.3 కోట్లకు పైగా పలుకుతోంది. ఏ మారుమూల ప్రాంతమైనా ఎకరాకు రూ.50 లక్షలకు తక్కువ ధరలు లేవు. ఇప్పుడు తప్పిదారిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మళ్లీ మునుపటి పరిస్థితులు పునరావృతం కాకతప్పదనే చర్చ జరుగుతోంది. అంతే కాకుండా, ధరణి వ్యవస్థను రద్దు చేయడం ద్వారా ఇప్పటి వరకు రైతుల చేతిలో ఉన్న భూములు తిరిగి అధికారుల చేతికి వెళ్లిపోతాయి. రైతుబంధుకు ధరణి వ్యవస్థ ఇప్పటి వరకు సమాచార కేంద్రంగా ఉంది. దీనిని తొలగిస్తే ప్రతి ఆరు నెలలకు ఒకసారి పహాణీకో, లేదా మరేదైనా సర్టిఫికెట్ కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అంతే కాకుండా, ఈ వ్యవస్థను రద్దు చేసి గతంలో ఉన్న రకరకాల కాలమ్స్‌ను జోడిస్తే ఇప్పటి వరకు రైతులకు ఉన్న హక్కులు వికేంద్రీకరించబడి సంబంధం లేని వ్యక్తులకు హక్కులు సంక్రమించే ప్రమాదం పొంచి ఉంది. అటు నీళ్లు, కరెంట్, ఇటు ధరణి తొలగింపు వల్ల కలిగే అనర్థాలు వెరచి భూముల ధరలు పదేళ్ల ముందు ఉన్న వాటి కంటే మరీ అధ్వానంగా పడిపోక తప్పని పరిస్థితులు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తద్వారా పదేండ్లు కష్టపడి నిర్మించుకున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఒక్కసారిగా కుప్పకూలక తప్పదని, మునుపటిలాగే గ్రామీణ ప్రాంత యువత వలసలు వెళ్లే పరిస్థితులు వస్తాయనే భయపడుతున్నారు.

### కాంగ్రెసోళ్ల మాటలు నమ్మం



అధికారంలోకి రాకముందే కాంగ్రెస్ నాయకులు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నరు. ధరణిని బంగాళఖాతంల కలుపుత మంటున్నరు. మూడు గంటల కరెంట్ సాలంటున్నరు. గిట్లయితే పండిలు పండించే పరిస్థితి ఉండదు. ఉన్న భూముల ధర తగ్గిపోతుంది. కథ మళ్లా మొదటి వత్తది. రైతు బంధు పథకం కౌలు రైతుకు ఇస్తే పట్టాదారుకు లేదని అంటున్నరు. ఇప్పుడే గిట్ల మాట్లాడితే ప్రభుత్వం వచ్చినంక ఇంకా ఏట్ల ఉంటదోనని రైతులు భయపడుతున్నరు. 3గంటల కరంట్ అని ఓ సారి, 10హెచ్‌పీ మోటర్ అని మరో సారి ఇట్లా రైతులను గందరగోళానికి గురి చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి రైతులు తగిన గుణపాఠం చెప్పక తప్పదు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే రైతులు ఏ ఇబ్బందులు లేకుండా ఏవుసం సక్రమంగా చేసుకుంటున్నరు. గందుకే ఈ సారి కూడా రైతులు బీఆర్ఎస్ పార్టీని గెలిపించడానికి సిద్ధంగా

**- కావటి రాజుయాదవ్ (ఓదెల)**

### ధరణితోనే భూముల ధరలు పెరిగినయ్



తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన ధరణి ఎంతో మంచిగున్నది. భూముల రికార్డులు ఆన్‌లైన్ల భద్రంగా పెట్టడంతో రైతులు భరోసాతో ఉంటున్నరు. నాటి కాంగ్రెస్ పాలనలో భూములకు రక్షణ లేదు. ధరలు కూడా ఇంత లేవు. పహాణీలు మొత్తం తప్పుల తడకగా ఉండే. దీంతో నిత్యం గ్రామాల్లో పంచాయితీలు అయ్యేటివి. రోజూ పోలీస్‌స్టేషన్లకు ఫిర్యాదులు పోయేవి. సీఎం కేసీఆర్ సార్ పుణ్యమా అని ధరణి రావడంతో ఎలాటి లోపాలు లేకుండా, భూములకు రక్షణ కల్పించిండు. భూములకు మంచి ధరలు అచ్చినయ్. రేవంత్‌రెడ్డి గెలిస్తే ధరణి రద్దు చేస్తా, పటేల్ పట్వారీ వ్యవస్థ తెస్తా అని నోటికచ్చినట్లు మాట్లాడుతున్నరు. గిలాంటి కాంగ్రెస్ ను చిత్తుచిత్తుగా ఓడిస్తం. రైతులకు మంచి చేసిన సీఎం సార్ వెంట ఉంటం.

**- చింతిరెడ్డి రాజు రైతు. మల్లయ్యపల్లె. (కాల్వశ్రీరాంపూర్)**



### మూడు గంటలిత్తే సాగు పడిపోతుంది

మాది జూలపల్లి మండల కేంద్రం. నేను చిన్న రైతును. కాంగ్రెస్ వస్తే మూడు గంటల కరెంట్ అంటున్నరు. అట్లయితే కష్టమే. చివరి మడి తడువదు..దీంతో సాగు విస్తీర్ణం తగ్గిపోతుంది. మధ్యలోనే పంట ఎండిపోతుంది. రైతులు పెట్టిన పెట్టుబడి కూడా చేతికిరాదు. రేవంత్‌రెడ్డి అన్నట్లు 10 హెచ్‌పీ కరెంట్ మోటర్లు పెట్టుకోవాలంటే ఎట్లా. పాత రోజులు గుర్తుకు వస్తున్నయ్. ఎకరం పంటకు సాగునీరు అందలాంటే బోర్లతో ఎకరం కూడా పారయ్. మూడు గంటల కరెంట్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు, స్టాటర్లు కాలిపోతయ్. పెద్ద మోటర్లు పెడితే బాగా డబ్బులు కావాలి. రాత్రిపూట కరెంట్ కోతలతో పొలాల వద్ద పాముకాటు చావులు చూసినమ్. రైతులను ఆగం చేసే కాంగ్రెస్ మాటలు నమ్మితే అరిగోస పడతం.

**-నెరువట్ల నర్సయ్య, రైతు, జూలపల్లి (జూలపల్లి)**

### వాళ్లత్తే భూముల విలువ తగ్గుతది

కాంగ్రెస్ ప్రభుత్వం గనుక అత్తే ధరణి పూర్తిగా తీసెత్తమని చెబుతున్నరు. అట్లా వాళ్లు ఎందుకు చెబుతున్నరో సమజైతలేదు. మళ్లా పాత పట్వారీ పద్ధతి గనుక తీసుకొత్తే భూ ములు కబ్జాదారుల పాలవుతయ్. కౌలుదారు చట్టం తెస్తే నష్టం ఎవరికీ ప్రయోజనం ఉంటది. భూ ములు ఉన్న రైతులు ఆగమయ్యే పరిస్థితి వత్తది. భూములకు రక్షణ ఉండదు. రిజిస్ట్రేషన్ కాడా దళారులు చెబితనే పని అయితది. రైతుబంధు, రైతుబీమా పథకాలు అగిపోతయ్. భూముల విలువ తగ్గిపోతది. రైతుల అభిప్రాయాలు తెలుసుకోకుండ పోర్టల్ తీసేస్తామనడం కూడా కరెక్టు కాదు. ఒకవేళ అధికారం ఇత్తే ఆగుతర కాంగ్రెసోళ్లు ఆగుతరో లేదో. అందుకే రైతులందరూ ఆలోచించి నిర్ణయం తీసుకోవాలె. ఇంటిపార్టీకే ఓటత్తేనే న్యాయం జరుతది.

**- దుండేవేన గట్టయ్య, రైతు, రత్నాపూర్ (రామగిరి)**



### ధరణితో భూముల లెక్కలు సాఫ్

ఎన్కటి నుంచి పెండింగ్ ల ఉన్న భూముల చిక్కులన్నీ సీఎం కేసీఆర్ ధరణి తెచ్చినంకనే సాఫ్ అయినయ్. ఎన్కటి పట్వార్లు ఒగలి భూమి ఇంకొకలకు రాసిండ్రు. ఊళ్లళ్ల కొట్లాటలు పెట్టించేది. పహాణీ కావాలన్నా, మ్యుటేషన్ కావాలన్నా ఏండ్లు గడిచేది. లంచం ఇస్తేనే పని అయ్యేది. ఇప్పుడు ఆ బాధ తప్పింది. అప్పట్ల భూమి రిజిస్ట్రేషన్ కోసం అరిగోస పడ్డం. ధరణి పోర్టల్ వల్ల ఇక్కడే మా మండలంలోనే పది నిమిషాల్లో పైసా ఖర్చులేకుండా పనైతాంది. అమ్మిన వ్యక్తి పేరు మీది కెళ్లి కొన్నోళ్ల పేరు మీదకు పాస్ బుక్కుల ఎక్కుతాంది. మునుపు రిజిస్ట్రేషన్ అయినంక మ్యుటేషన్ చేయించుకోవాలని పట్వార్ల సుట్టూ రోజులకానంగ తిరిగినం. ఇప్పుడు మంచి సౌలత్ అయ్యింది. సీఎం సార్ ధరణి తీసుకవచ్చి భూముల చిక్కు లేకుండా చేసిండు.

**-ఆదె చంద్రయ్య. రైతు, జాఫర్‌ఖాన్‌పేట (కాల్వశ్రీరాంపూర్)**

### ఆఫీసుల చుట్టూ తిరుగాలె..

కాంగ్రెస్ వాళ్లు ధరణి పోర్టల్ రద్దు చేసి భూమాత తెస్తమని అంటున్నారు మీ భూమాత మాకొద్దు.. మా ధరణే మా భూములకు రక్ష. ధరణి పోర్టల్ ఎత్తివేస్తే మళ్ల దళారులే రాజ్యమేలుతరు. దళారీ వ్యవస్థ మళ్ల రావద్దు. రైతులను గోస పోసుకోవద్దు..తెలంగాణ ఏర్పడ్డాకనే రైతులు సంతోషంగా ఉంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో భూముల పట్టాల కోసం ఏళ్ల తరబడి ఆఫీసుల చుట్టు తిరిగినా పట్టాలు కాలేదు. తెలంగాణ ప్రభుత్వం ధరణి తీసుకొచ్చినంకా మండలాఫీసులోనే పట్టాలు అవుతున్నయి. పట్టాల కోసం రైతులు ఎక్కువ దూరం పోవాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఎంతో ఈజీగా రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మళ్ల ఆఫీసుల చుట్టు తిరుగుతూ ఉండాలే. అధికారులకు లంచాలు ఇవ్వాలే. అలాంటి కాంగ్రెస్ ప్రభుత్వం మాకొద్దు.



**- ఏనుగుల తిరుపతి, రైతు రాఘవాపూర్, (పెద్దపల్లి కమాన్)**

### ధరణి తీసేస్తే రైతుబంధు రద్దయితది..



నాకు గ్రామంలో ఎడెకరాల ఎవుసం భూమి ఉన్నది. తెలంగాణ రాకముందు ఒక్క పంట గూడా సక్కగా పండించక పోయేది. సీఎం కేసీఆర్ పాలన వచ్చాక రైతులకు అన్ని విధాలుగా మేలు చేస్తున్నాడు. రైతుల భూములను ఆన్‌లైన్ చేశారు. డిజిటల్ పాసు బుక్కులు సర్వే నంబర్ల వారీగా సరిజేసి అందజేశారు. ధరణితోనే మాకు రైతు బంధు సాయం అందుతుంది. ఇప్పుడు మా భూములు ధరణిలో భద్రంగా ఉన్నాయి. మా భూములకు ఎలాంటి ధోకా లేదు. భూములను అమ్మడానికి కొనడానికి ధరణి ఎంతగానో రైతులకు ఉపయోగపడుతున్నది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ధరణి మార్చేసి భూమాత తీసుకొస్తామని అంటున్నరు. అంటే వాళ్ల మాటలు బట్టి ఏమీ తెలుస్తుందంటే మళ్లీ పట్వారీ వ్యవస్థ తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. కావున మళ్లీ పాత రోజులు వచ్చి రైతులు గోస పడక తప్పదు. రైతుబంధు కూడా రద్దయ్యే ప్రమాదముంటది.

**- సాన కొమరయ్య, రైతు, నంది మేడారం ( ధర్మారం మండలం)**

### రేవంత్‌రెడ్డికి ఎవుసం గురించి ఎం తెలుసు?

నాకు రెండు నాలుగు ఎకరాల భూమి ఉన్నది. రెండు ఎకరాలను మిర్చి పంట వేశాను. రెండు ఎకరాలు వరి పంట పండిస్తున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కరెంట్‌కు చానా తిప్పలు ఉండేటివి. తెలంగాణ వచ్చినంక కష్టాలు పోయాయి. అంతకు ముందు ప్రభుత్వాలు నాలుగైదు గంటలే అరకొర కరెంట్ ఇచ్చేటోళ్లు. ఆఫ్ కరెంట్ వచ్చేది. దీంతో మోటార్లు కాలిపోయేటివి. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక రైతులకు అన్ని విధాలా మేలు జరుగుతుంది. రైతుల కోసం మంచి పథకాలను తీసుకొచ్చిండు. కరెంట్ ఫుల్.. కాలువ నీళ్లు, చెరువుల్లో నీళ్లు పుష్కలంగా ఉండేలా చేసిండు. ప్రతి ఏటా రెండు పంటలు పండుతున్నయి. రైతులు అన్ని విధాలా లాభపడ్డరు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఎవుసం గురించి తెలియదు. అందుకే మూడు గంటల కరెంట్ ఇస్తామంటున్నడు. 10 హెచ్‌పీ మోటార్లు పెట్టుకోవాలని చెబుతున్నడు.




**- గాండ్ల శేఖర్, రైతు, రంగాపూర్ (పెద్దపల్లి కమాన్)**

### పట్వార్ల చుట్టూ తిరిగే రోజులు మళ్లత్తయ్..

కాంగ్రెస్‌సోళ్లు పటేల్, పట్వార్ల వ్యవస్థను తీసుకురావాలని చూస్తున్నరు. ఇప్పుడే గిట్ల ఏవుసం గురించి, ధరణి గురించి అడ్డందిడ్డం మాట్లాడుతాండ్లు. కొనుక్కున్న భూములు పట్టా చేయించుకోవడానికి గ్రామ పంచాయతీ నుంచి కలెక్టరాఫీస్ వరకు తిరిగి తిరిగి అవస్థలు పడ్డం. నెలల తరబడి ఆఫీసుల సుట్టూ తిప్పుకున్నా పైసలు ముట్టందే పనిచేసేటోళ్లు కాదు. పైరవీ చేసేటోళ్లను పట్టుకొని వాళ్లు అడిగినన్నీ పైసలిచ్చి పట్టాలు చేయించుకునేటోళ్లం. ఇవన్నీ తెలిసే సీఎం కేసీఆర్ ఈ వ్యవస్థను మొత్తం రద్దు చేసి ధరణిని తీసుకువచ్చిండు. ధరణి వచ్చినప్పటి నుంచి ఏ తిప్పలు లేవు. ఆఫీస్‌ల చుట్టూ తిరిగే పని లేదు. పైరవీలు చేసేటోళ్లతోని అవసరం లేదు. మీ సేవకు పోయి ఆన్‌లైన్ల బుక్ చేసుకుంటే వాళ్లే టైం ఇస్తున్నరు. వాళ్లిచ్చిన టైంకు పోతే పట్టా చేసి కాగితాలిచ్చి పంపుతున్నరు. ఇంత మంచి సౌలత్‌ను తీసేసి మునుపు పడ్డ తిప్పలు తీసుకురావాలని కాంగ్రెసోళ్లు చూస్తున్నరు. రైతులు మంచిగుండడు కాంగ్రెసోళ్లకు ఇష్టం లేదు.

**-పంచిక రమేష్,రైతు, వెంకటాపూర్, మంథని రూరల్**



### వాళ్లస్తే రైతులకు మళ్లీ కరెంట్ కష్టాలే..

రైతులు మంచిగ బతుకుడు అంటే కాంగ్రెస్ పార్టీకి ఇష్టం లేదు. ఎందుకంటే అనేక ఏండ్లు గద్దెమీద ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు కూడ రైతుల కష్టాలు పట్టించుకోలె. వాళ్లు అధికారంల ఉన్నప్పుడు రాత్రి, పగలు అనే తేడా మాలాంటి రైతులకు లేదు. కరెంట్ ఎప్పుడో అర్థరాత్రి ఇచ్చేటోళ్లు దానికి రాత్రం తా తెలివితోటి ఉండి పంటలకు నీరు పారించుకునేటోళ్లం. అలా ఇచ్చే కరెంట్ సక్కగ ఇయ్యక పోయేది. కాంగ్రెస్సోళ్లు సరిగ్గా ఇయ్యక పోవడంతో ఇటు పంటలు సరిగ్గా పండక ఆర్థికంగా చాలా నష్ట పోయేటోళ్లం. అప్పుడు కరెంట్‌లేక నిద్రలేని రాత్రుళ్లు గడిపినం. ఆ కష్టాలు చూసి ఏవుసం కన్నా కూలీ పని చేసుకునేది ఉత్తమం అనుకునేది. కానీ తెలంగాణ ప్రభుత్వం అచ్చినంక మా బతుకులు మొత్తం మారినయ్. 24 గంటల కరెంట్ ఇస్తుండ్లు. నీళ్ల కోసం పొలం, చేన్ల కాడికి రాత్రి పోయే రోజులు పోయినయ్. కానీ కాంగ్రెస్ మళ్ల అధికారంలోకి వస్తే ఆ కష్టాలను కొని తెచ్చుకున్నట్టే.

**-ఎడ్ల మల్లికార్జున్, రైతు, పోతారం, మంథని రూరల్**

### పదిహెచ్‌పీ మోటర్లనోళ్లను పాతరపెడ్తరు



ఎన్నికల టైంల కాంగ్రెస్ నాయకులు రైతులను ఆగంపట్టిత్తున్నరు. వాడు అచ్చేదెందో పోయేందేదో గానీ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎవుసానికి మూడు గంటల కరెంట్ సాలంటడు. పదిహెచ్‌పీ మోటర్లు పెట్టుకోమంటడు. ధరణి తీసి భూమాత తెత్తా అంటున్నడు. ఇంకో పెద్దమనిషి రైతుబంధు దుబార అంటున్నడు. కాంగ్రెస్ పార్టోళ్లకు ఎవుసాయదారులంటే చిన్నచూపు ఉన్నది. అందుకే అడ్డం పొడుగు మాట్లాడుతున్నరు. పెద్ద మోటర్లు పెడితే పైప్‌లైన్లు మార్చడానికి, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ పెట్టుకోవడానికి మత్తు ఖర్చయితది. ఈ ఖర్చులన్నీ కాంగ్రెసోళ్లు ఇత్తరా? ధరణి పోర్టల్ తీసేస్తే రైతులు మళ్లా అరిగోస పడాల్సివత్తది. దీంతోటి ఎవుసం బంద్‌పెట్టి కైకిలీపోయే పరిస్థితి వత్తది. భూముల రేట్లు తగ్గుతయ్. వచ్చిన పంట గింజలు కూడా తినేదానికే సరిపోతయ్. అందుకే చేతి గుర్తు పార్టీవాళ్లను రైతులెవరూ నమ్మరు. గట్ల ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఓట్లతోటి మీటరు లోతుల పాతరపెడ్తరు.

**-ఏనుగుల సదయ్య, రైతు, ఉప్పరపల్లి (ఓదెల)**

### తెలంగాణ అచ్చినంకనే ధరలు పెరిగినయ్..



తెలంగాణ సర్కారు అచ్చినంకనే ఎవుసానికి సరిపడా కరెంట్ ఇత్తున్నది. పడావు పడ్డ భూములు గూడా సాగులోకి తెచ్చినం. రెండు పంటలు సక్కగా పండుతున్నయ్. ధరణి తేవడంతో రిజిస్ట్రేషన్లు అల్కగా అవుతున్నయ్. దీనిద్వారానే నెలనెలా రైతుబంధు అందుతున్నది. దీంతో భూముల ధరలు నాలుగింతలు అయినయ్. రైతుల గౌరవం కూడా పెరిగింది. కానీ కాంగ్రెస్సోళ్లేమో మూడు గంటల కరెంట్ ఇత్తమంటున్నరు. ధరణి తీసేసి గంగల కలుపతమంటున్నరు. రేవంత్‌రెడ్డికి ఏవుసం గురించి ఎం తెలుసని పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నడు. గిట్లయితే భూముల ధరలు మళ్లా మొదటికత్తయ్. పట్వారీలు వత్తరు. భూముల రికార్డులు తారుమారు జేత్తరు. మళ్లా పంచాయితీలు మొదలైతయ్. పొద్దుగాలలేత్తే పనులు బంద్‌పెట్టి పోలీస్‌స్టేషన్ల పొంటి తిరుగడవుతది. రైతులు జాగ్రత్తగా ఉండాలె. మనోళ్లేవరో..మంచి జేసేవాళ్లు ఎవరో ఆలోచించాలె. 24 గంటల కరెంట్‌ను జూసి సీఎం కేసీఆర్ సారుకు అండగా నిలువాలె.

**- గొడుగు మల్లేశ్ రైతు. పెద్దరాత్‌పల్లి (కాల్వశ్రీరాంపూర్)**



### మూడు గంటలిత్తే ఎవుసం మూలకువడ్తది

తెలంగాణ రాకముందు రైతుల బతుకులు ఆగంలో ఉండేవి. సాగు నీళ్లలేక, సరిపడా కరెంట్ రాక ఉన్న భూములను ఎండబెట్టేది. కానీ రైతుల బాధలు తెలిసిన సీఎం కేసీఆర్ సారు 24 గంటల కరెంట్ మొదలువెట్టిండు. రైతుబంధు ఇచ్చి పెట్టుబడి రందీ తీరుత్తున్నడు. కానీ ఓర్వలేని రేవంత్‌రెడ్డి సీఎం సారు మీద ఉన్న కోపాన్ని రైతుల మీద తీసుకోవాలనుకుంటున్నడు. ఆయన పార్టీ అచ్చేది లేదు..సీఎం అయ్యేది లేదు గానీ ధరణి ఎత్తేత్తనని గప్పాలు గొడుతున్నడు. మూడు గంటల కరెంటే రైతులకు మత్తయితదని మాట్లాడుతున్నడు. గీట్లయితే ఎవుసం మూలకుపెట్టి బతుకు దెరువుకు బొంబాయో, దుబాయ్‌కో ఎళ్లాల్సివత్తది. అందుకే కాంగ్రెస్ పార్టీకి రైతులెవరూ ఓటేయ్యరు.

**గట్టు ప్రసాద్, రాంపల్లి, పెద్దపల్లి టౌన్**

### పట్వారీలత్తే మళ్లీ పరేషానే



తెలంగాణ వచ్చినంక సీఎం కేసీఆర్ పెట్టిన ధరణితోనే మా భూముల బాధలు తప్పినయ్. కాంగ్రెసోళ్లయ్ అన్ని చెడగొట్టు మాటలే ఉన్నయ్. మళ్లీ పటేల్, పట్వారీలత్తే మన బతుకులు ఆగమైతయ్. ఎన్కట పట్వార్లు రైతులను అరిగోస పుచ్చుకున్నరు. ఇప్పుడు కేసీఆర్ దయ వల్ల బాధలు తప్పినయ్. ఎన్నో ఏండ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న భూములు పంచాయతీలు ధరణి వచ్చాకే తెగినయ్. ధరణి ఎత్తేసేత మళ్లీ దళారులదే రాజ్యమైతది. ధరణిని ఇట్లనే ఉండాలె. పహాణీ కోసం పట్వారీ దగ్గరికి పోతే పైసలియ్యందే పని కాకపోయేది. ఇప్పుడు రెండు నిమిషాల్లో ఆన్‌లైన్ లో పహాణీ వస్తున్నది.

**-సిరాల గట్టయ్య, రైతు, జాఫర్‌ఖాన్‌పేట (కాల్వశ్రీరాంపూర్)**